జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ ‖సంపుటి:1 ‖ సంచిక: 83 ‖ మంగళవారం ‖ 18-8-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-



18 ఆగస్టు 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:03 సూర్యాస్తమయం - సా. 6:36 తిథి షష్ఠి సా. 5:55 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం స్వాతి ఉ. 6:41ం వరకు యోగం శుక్ల తె. 3:15ం వరకు కరణం తైతుల సా. 5:55 వరకు గరజి ఉ. 6:30ం వరకు వర్జ్యం ఉ. 10:59 నుండి మ. 12:42 వరకు దుర్ముహూర్తం ఉ. 8:34 నుండి ఉ. 9:24 వరకు రా. 11:11 నుండి రా. 11:57 వరకు రాహుకాలం మ. 3:28 నుండి సా. 5:02 వరకు యమగండం ఉ. 9:11 నుండి ఉ. 10:45 వరకు గుళికాకాలం మ. 12:19 నుండి మ. 1:54 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:27 నుండి తె. 5:15 వరకు అమృత ఘడియలు రా. 9:18 నుండి రా. 11:01 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:45 వరకు గమనిక: “ం” అనగా మరుసటి రోజున



# విద్య, వైద్య రంగాలకు..
# అత్యంత ప్రాధాన్యం

తెలంగాణ ప్రజా పాలనలో విద్య,వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



### ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి
### విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది
### ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం
### సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్17: ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న తరువాయి 2 వ పేజీలో..



# మెగా డీఎస్సీపై సీఎం సవాల్

### పారదర్శకంగా ఉపాధ్యాయ నియామకాలు
### 148 రోజుల్లో పోస్టుల భర్తీ.. వైసీపీ ఆరోపణలపై విమర్శలు
### వైసీపీ కి ధైర్యం ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలి

మెగా డీఎస్సీ నియామకాలలో ఒక్క డీవియేషన్ కూడా జరగలేదని, పూర్తిగా ప్రతిభ ఆధారంగానే నియామక ప్రక్రియను నిర్వహించామని ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో స్పష్టం చేశారు. డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ ప్రేరేపితమైనవేనని విమర్శించారు. ఆరోపణలు చేసే వారు ధైర్యం ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలని సవాల్ విసిరారు.

అమరావతి, ఆగస్టు 17 : ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా సాగిందని, యువతకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలు అందించడం ద్వారానే రాష్ట్ర భవిష్యత్తు బలోపేతం అవుతుందని చంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ హయాంలోనే విద్యా సంస్కరణలకు పునాది పడిందని, అనంతరం తమ ప్రభుత్వాలు విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం తరువాయి 2 వ పేజీలో..

# డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

### ప్రజల్లో గందరగోళం రేపిన 22ఎ జాబితా
### సీలింగ్ చట్టం ఎత్తేశాక మళ్లీ ఎందుకొచ్చింది
### సిఎం రేవంత్ ఇల్లు జాబితాలో వచ్చాకనే చురుకు
### పట్టు లేదనడానికి ఇదే పెద్ద నిదర్శనం: హరీష్



హైదరాబాద్,ఆగస్ట్17 : రాష్ట్రంలో 22ఎ సెక్షన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా భూములను నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను తీవ్ర గందరగోళానికి, అయోమయానికి గురిచేస్తోందని.. బిఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీష్ రా వు ఆరోపించారు. ఎవరి భూమి 22ఎలో ఉందో, ఎవరిది లేదో తెలియక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారని మాజీ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో తరువాయి 2 వ పేజీలో...



# కల్యాణలక్ష్మి కోసం రాష్ట్రవ్యాప్త పోరు

### బీఆర్ఎస్ పిలుపుతో మండల కేంద్రాల్లో ఆందోళనలు.. పథకాల కొనసాగింపే ప్రధాన డిమాండ్
### ప్రభుత్వ వైఖరిపై ప్రతిపక్ష విమర్శలు.. తెలంగాణవ్యాప్తంగా ఉద్రిక్త రాజకీయ వాతావరణం

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కొనసాగింపును డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ సోమవారం పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

హైదరాబాద్, ఆగస్టు 17: తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక అండగా నిలిచిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల తరువాయి 2 వ పేజీలో...

# 22ఎ భూములపై ఆందోళన వద్దు




### అధికారుల తప్పిదం వల్లనే ఇలా జరిగింది
### అందుకు ప్రజలను క్షమాపణలు కోరుతున్నాం
### మీడియా సమావేశంలో పొంగులేటి వివరణ

హైదరాబాద్,ఆగస్ట్17:ప్రైవేటు వ్యక్తుల ఆస్తికి ఆటంకం కలిగించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారంటూ మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి 750 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో మీడియాతో పొంగులేటి మాట్లాడుతూ..అధికారుల పొరపాటు వల్ల ఇలా జరిగిందన్నారు. 22ఏ భూములపై నాలుగు జిల్లాల్లోని అధికారులతో కలిసి చర్చించాం. గతంలో ఆ తరువాయి 2 వ పేజీలో...

# మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబాటు



### ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి.. మహాలక్ష్మి హామీ అమలుపై స్పష్టత
### నైపుణ్యాభివృద్ధి, ఉపాధికి ప్రాధాన్యం.. మెదక్ ఖిల్లాకు ప్రత్యేక తపాలా కవర్ ఆవిష్కరణ

మహిళల ఆర్థిక స్వావలంబన, యువతకు నైపుణ్యాభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని శక్తి, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ జీ. వివేక్ వెంకటస్వామి తెలిపారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని శాంతా బయోటెక్నాలజీస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక జాబ్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మెదక్, ఆగస్టు 17: పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి చెప్పారు. ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న వందలాది పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ తరువాయి 2 వ పేజీలో...

# నేటి రాశి ఫలాలు

మేషం: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. పాతమిత్రులను కలుసుకుని కీలక విషయాలు చర్చిస్తారు. చేపట్టిన పనులు ఆశాజనకంగా సాగుతాయి. విందువినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

వృషభం: స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సన్నిహితుల నుండి అందిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతల నుండి ఉపశమనం కలుగుతుంది.

మిధునం: చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

కర్కాటకం: ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. చేపట్టిన పనులలో శ్రమ పడ్డా ఫలితం ఉండదు. సోదరులతో ఆస్తి వివాదాలు మరింత చికాకు కలిగిస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు కొంత మందకోడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది.

సింహం: సమాజంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఇంటాబయటా ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

కన్య: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. దీర్ఘకాలిక వివాదాల నుంచి బయటపడగలుగుతారు. దూరపు బంధువులను కలుసుకుని వివాహ విషయమై చర్చ చేస్తారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. నిరుద్యోగులకు నూతన అవకాశాలు లభిస్తాయి.

తుల: ఆర్థిక ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వ్యాపారమున ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. ఉద్యోగాలు నిరాశ పరుస్తాయి.

వృశ్చికం: శ్రమతో కూడిన దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగులకు ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి.

ధనస్సు: బంధు మిత్రులతో గృహమున మరింత ఉత్సాహంగా గడుపుతారు. మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. వ్యాపారాల విస్తరణకు కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుతాయి. ఉద్యోగమున మరింత అనుకూల వాతావరణం ఉంటుంది.

మకరం: వ్యయప్రయాసలతో కానీ పనులు పూర్తి కావు. దూర ప్రయాణాలు ఆకస్మికంగా వాయిదా పడతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సమస్యల వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒడిదుడుకులు అధికమవుతాయి.

కుంభం: ప్రముఖులతో పరిచయాలు భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. వృత్తివ్యాపారాలు సకాలంలో పూర్తి చేస్తారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. సంతానం విద్యా విషయాలు సంతృప్తినిస్తాయి.

మీనం: కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. వ్యాపారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఉద్యోగాలలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి. చేపట్టిన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. వృధా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాల్సి ఉంటుంది.



# మెగా డీఎస్సీపై సీఎం సవాల్

మొదటి పేజీ తరువాయి

ఇచ్చాయని గుర్తు చేశారు. గత ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయని వారు ఇప్పుడు డీఎస్సీపై విమర్శలు చేయడం విచిత్రంగా ఉందన్నారు. విద్యారంగ అభివృద్ధికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ప్రక్రియను ప్రారంభించి, 15,941 ఉపాధ్యాయ పోస్టులను కేవలం 148 రోజుల్లోనే భర్తీ చేశామని ముఖ్యమంత్రి వివరించారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు, రిజర్వేషన్ల అమలు, పరీక్షల నిర్వహణ నుంచి ఫలితాల విడుదల వరకు ప్రతి దశను కట్టుదిట్టంగా నిర్వహించామని చెప్పారు. 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించి, పూర్తిగా మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో ఎంపికలు చేపట్టామని వెల్లడించారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ అందుబాటులో ఉంచామని తెలిపారు. డీఎస్సీ అమలులో ఎక్కడా అన్యాయం జరగకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని చంద్రబాబు పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిశీలన కోసం జోనల్ స్థాయి కమిటీలు, రాష్ట్ర స్థాయి కమిటీలు, అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి పరిష్కరించామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం పారదర్శకత, బాధ్యతాయుత పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విమర్శలు రాజకీయ కుట్రలో భాగమని ముఖ్యమంత్రి ఆరోపించారు. తప్పుడు ప్రచారాలు, ఫేక్ నిరసనల ద్వారా ప్రజల్లో అనుమానాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. అయితే డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులే స్వయంగా ముందుకు వచ్చి నియామకాలు పారదర్శకంగా జరిగాయని చెబుతున్నారని గుర్తు చేశారు. ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన యువతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇది వారి కృషిని కించపరచడమేనని విమర్శించారు. ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించడం ప్రభుత్వ ధర్మమని చంద్రబాబు స్పష్టం చేశారు. నిజంగా ఆధారాలు ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలని, బయట ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామకాల విషయంలో ప్రభుత్వం పూర్తిస్థాయి బాధ్యతతో వ్యవహరించిందని, రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఎలాంటి రాజీ ఉండదని చెప్పారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తూ భవిష్యత్తులో కూడా ఇదే విధమైన సంస్కరణలను కొనసాగిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు



# డబ్బులు దండుకోవడానికే నిషేధిత జాబితా

మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 1999లోనే అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశారు. మన రాష్ట్రంలో 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ చట్టాన్ని పూర్తిగా ఎత్తేశారు. కానీ ఆనాడు సీలింగ్ పరిధి నుంచి బయటపడి, క్లియర్ అయిన భూములను కూడా ఈ ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ తీసుకొచ్చి సీలింగ్ యాక్ట్ కింద 22ఎలో పెట్టడం ఏ రకమైన న్యాయం..ఈ ప్రభుత్వానికి కనీస అవగాహన, పాలనపై పట్టు లేదనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏకంగా ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను కూడా 22ఎ నిషేధిత జాబితాలో పెట్టారంటే ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. హైదరాబాద్ నగరంలో లక్షలాది ప్రాపర్టీలను రాత్రికి రాత్రి ప్రొహిబిషన్ లిస్ట్‌లో చేర్చారు. శ్రీనగర్ కాలనీ సర్వే నంబర్ 8, 9లలో గత 20 ఏళ్లుగా ఇళ్లు కట్టుకుని ప్రశాంతంగా నివసిస్తున్న ప్రజల ప్రాపర్టీలను కూడా ఇప్పుడు 22ఎలో పెట్టడం దుర్మార్గం. 30 ఏళ్ల క్రితం కొనుక్కున్న అపార్ట్‌మెంట్ ఎ÷-లాట్లను కూడా నిషేధిత జాబితాలో పెడితే ఆ ప్రజలు ఇప్పుడు ఎక్కడికి పోవాలని హరీశ్ రావు ప్రశ్నించారు. తమ ప్రాపర్టీ 22ంలో ఉందన్న విషయం చాలామంది సామాన్యులకు తెలియడం లేదు. తీరా రిజిస్ట్రేషన్ కోసం చలాన్లు కట్టి, డబ్బులు చెల్లించిన తర్వాత.. చివర్లో మీ భూమి 22ఎ లో ఉందని చెప్పి రిజిస్ట్రేషన్ ఆపేస్తున్నారు. పైగా రిజిస్ట్రేషన్ కోసం కట్టిన చలాన్ డబ్బులు కూడా వాపస్ ఇవ్వకుండా ప్రభుత్వం ప్రజల సొమ్మును నిలువునా దోచుకుంటోందని మండిపడ్డారు. గతంలో ప్రభుత్వం నుంచి అధికారికంగా ఔక్షఅ వచ్చిన భూములకు బ్యాంకులు కూడా లోన్లు ఇచ్చాయి. ఇప్పుడు అవే భూములను తీసుకొచ్చి 22ఎ లో పెట్టడంతో అటు ప్రజలు, ఇటు బ్యాంకులు ఇద్దరూ ఆగం అవుతున్నారు. బంజారాహిల్స్ హౌసింగ్ సొసైటీ లాంటి ప్రాంతాలను సైతం ప్రొహిబిషన్ లో పెట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు హరీశ్ రావు. 22ఎ అనేది ఈ ప్రభుత్వానికి ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఒక ఆయుధంగా మారిందన్నారు. రెవెన్యూ శాఖలో ఏ పని కావాలన్నా, 22ం నుంచి భూమిని బయటకు తీయాలన్నా 30 శాతం కమీషన్ ఇవ్వాలనేది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. 30 శాతం కమీషన్ లేనిదే రెవెన్యూ శాఖలో ఒక్క ÷ల్ కూడా కదలడం లేదు. చివరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఎ ప్రొహిబిషన్ లిస్ట్‌లో ఉందంటే ఆశ్చర్యం కలుగుతోంది. తన సొంత ఇంటికి సెగ తగిలే సరికి ప్రభుత్వంలో హడావిడి మొదలైందన్నారు హరీశ్ రావు. మీకు చురుకు తగిలితేనే కానీ సామాన్యుల బాధలు పట్టవా.. ? స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే, ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి..? వాళ్ల గోడు ఎవరు వినాలి. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది ఈ ప్రభుత్వ తీరని హరీశ్ రావు ఎద్దేవా చేశారు. ముందు అడ్డగోలుగా భూములను 22ఎలో వేయడం, ఆ తర్వాత దాన్ని సరిచేయడానికి జీవోలు తెస్తాం, రివ్యూలు చేస్తాం అని డ్రామాలు ఆడటం ఎందుకు.. తప్పు జరిగినప్పుడు తక్షణమే ఆ భూములను 22ం నుంచి తొలగించాలి కానీ.. ఈ రివ్యూల పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి..? కమీషన్ల కోసమేనా..? అసలు ఈ ప్రాపర్టీలను అందులో ఎవరు పెట్టారు? కమీషన్లు తీసుకుని ఎవరు తొలగిస్తున్నారు..? దీనిపై తక్షణమే విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

## మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబాటు

మొదటి పేజీ తరువాయి

కోర్సుల్లో మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాల పేరుతో యువత మోసపోకుండా పారదర్శక వ్యవస్థ ద్వారా అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. విదేశీ ఉపాధి అవకాశాల కోసం జర్మన్, జపనీస్ భాషల్లో కూడా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మహిళా సాధికారత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీలు, వడ్డీలేని రుణాలు, ఆదాయ వనరులు కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే హామీ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. మెదక్ ఖిల్లా చారిత్రక ప్రాధాన్యతను గుర్తిస్తూ తపాలా శాఖ విడుదల చేసిన ప్రత్యేక తపాలా కవర్‌ను మంత్రి ఆవిష్కరించారు. మెదక్ ఖిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం కుచారం కస్తూర్బా బాలికల విద్యాలయంలో రూ.3.25 కోట్ల వ్యయంతో నిర్మించిన అదనపు మౌలిక సదుపాయాలను ప్రారంభించారు.



# విద్య, వైద్య రంగాలకు...అత్యంత ప్రాధాన్యం

మొదటి పేజీ తరువాయి

ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి.2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం.ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందిచేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు.కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట.అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా..ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి..నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా.వాళ్లు అబద్దాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు.

# 22ఎ భూములపై ఆందోళన వద్దు

మొదటి పేజీ తరువాయి

భూములు యూఎల్‌సీ జాబితాలో ఉన్నాయి. నిషేధిత జాబితాను అప్‌డేట్ చేయడంలో పొరపాటు జరిగిందన్నారు. అధికారుల తరఫున క్షమాపణలు కోరుతున్నానని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆస్తుల్ని 22ఏ జాబితా నుంచి త్వరలోనే తొలగిస్తాం. దీనికి సంబంధించి ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18005994788కు సంప్రదించాలన్నారు. భూములకు సంబంధించి అన్నీ సక్రమంగా ఉన్నవారు ఆందోళన చెందవద్దని పొంగులేటి అన్నారు. 22ఎ వల్ల ఇబ్బంది పడుతున్న ప్రజలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. దీన్ని బూచిగా చూపి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యవహారంలో సత్వర కేసుల పరిష్కారం కోసం ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## కల్యాణలక్ష్మి కోసం రాష్ట్రవ్యాప్త పోరు

మొదటి పేజీ తరువాయి

అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. పథకాల అమలులో జాప్యం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఆర్థిక సాయాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని నల్లగొండ, ఆర్మూర్, హబ్సిగూడ, కుత్బుల్లాపూర్‌తో పాటు పలు జిల్లాల్లో బీఆర్ఎస్ నేతలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొనసాగించాలని, సంక్షేమ కార్యక్రమాలను బలహీనపరిచే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో వినతిపత్రాలు సమర్పించేందుకు ప్రయత్నించిన నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి.

# శ్వేత

## సంపాదకీయం

**మంగళవారం 18-8-2026**

# సోలార్ పవర్‌లో స్వయం సమృద్ధి సాధించాలి!

దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని, విదేశాలపై ఆధారపడడం మానుకోవాలని ప్రధాని మోడీ ఎర్రకోట్ నుంచి ఇచ్చిన సందేశం ఆలోచింపచేసేదిగా ఉంది. అయితే దేశాన్ని స్వయం సమృద్ధిగా నిలపాల్సిన బాధ్యత పాలకులదే. ముఖ్యంగా ఇంధన, ఆహార రంగాల్లో మనం మరింత బలం కావాల్సి ఉంది. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ తన ఇంధన అసవరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడు తోంది. 88.5 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటోంది. సహజవాయువు, పెట్రోలియం ఇలా అన్నింటికి గల్ఫ్, రష్యా, అమెరికా వంటి దేశాలే దిక్కు. అంతర్జాతీయ పరిణామాలకు భారత ఇంధన భద్రత ఒడిదొడు కులకు లోనవుతోంది. ఇటీవల హార్ముజ్ జలసంధి, ఇరాన్ అమెరికా యుద్ధం వల్ల భారత్ లో ఎల్పీజీ కొరత ఏర్పడింది. ఎక్కువ దిగుమతుల వల్ల విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఒక్క యుద్ధం వస్తే ఎంతగా ఒడిదుడుకులకు లోనవుతాం. అందువల్ల సహజ వనరులను అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. విదేశాల నుంచి అదేపనిగా అవసరం ఉన్నా లేకున్నా దిగుమతలును చేసుకోవడం వల్ల దేశీయంగా ధరలు పరుగులు పెడుతున్నాయి. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి. ముఖ్యంగా ఉప్పులు, పప్పులు, నూనెలపై ఆంక్షలు విధించుకోవాలి. దేశీయంగా ఆహార ఉత్పత్తులను పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయం తప్పనిసరి చేయాలి. ఇకపోతే గ్యాస్, పెట్రొ తదితర ఉత్పత్తులపైనా ఆన్వేషణ సాగాలి. మన సముద్ర భాగాల్లోనే గ్యాస్ లేదా పెట్రోలియం నిల్వలు వెలుగులోకి వస్తే భారతదేశానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రధాని మోడీ కూడా సముద్ర మథనం గురించి చెప్పారు. ఆగస్టు 15 స్వాతంత్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని నరేంద్రమోడీ ప్రసంగిస్తూ.. సముద్ర మంథన్ ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. భారత జలాల్లో సముద్ర అడుగు భాగాల్లో ఇంధన వనరుల కోసం అన్వేషన కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్ని వెల్లడించారు. భారత్ తన ఇంధన అవసరాల్లో మెజారిటీ దిగుమతులపై ఆధారపడుతోంది.

అయితే, గతంలో భారత్‌లో ఆఫ్‌షోర్ అన్వేషణకు సంబంధించిన ప్రాంతాల్లో దాదాపు 99 శాతం ప్రాంతాన్ని గతంలో 'నో–గో' జోన్‌లుగా ప్రకటించినట్లు, ఇప్పుడు వాటిలో చాలా ప్రాంతాలను అన్వేషణ కోసం తెరిచినట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల గ్యాస్, పెట్రోలియం వంటి ఇంధనాన్ని గుర్తించే పక్రియ మరింత వేగవంతం కానుంది. భారత్ ఇంధన నిల్వల్ని అన్వేషించేందుకు 'సముద్ర మంథన్' అనే నేషనల్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప÷–లోరేషన్ స్కీమ్ ప్రకటించింది. భారతదేశ సముద్ర తీర ప్రాంతాల్లోని బేసిన్లలో చమురు, సహజ వాయువు నిల్వలను గుర్తించి భవిష్యత్తులో ఉత్పత్తి పెంచడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 జూలై 31న కేంద్ర మంత్రివర్గం ఈ పథకానికి 2030–31 ఆర్థిక సంవత్సరం వరకు రూ.84,084 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో సముద్ర అడుగుభాగంలోని భౌగోళిక నిర్మాణాలను గుర్తించేందుకు సిస్మిక్ సర్వేలు, డీప్ సీ, అల్ట్రా డీప్ వాటర్ డ్రిల్లింగ్,సైంటిఫిక్ డ్రిల్లింగ్, సాధారణ ఆఫ్‌షోర్ మౌలిక వసతులు, చమురు–గ్యాస్ తయారీ వంటివి ఉంటాయి. ఈ పథకం ద్వారా 600 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా ఆయిల్ ఈక్వివలెంట్ హైడ్రోకార్బన్ నిల్వలు దేశానికి సమకూర్చవచ్చని, దేశీయ ఉత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ ప్రకారం భారత్‌కు తొమ్మిది ఆఫ్‌షోర్ బేసిన్లు ఉన్నాయి. ఇవి మొత్తం సుమారు 17.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం నో–గో ఏరియా ప్రాంతాలను 13.67 లక్షల చదరపు కిలోమీటర్ల నుంచి 24,832 చదరపు కిలోమీటర్లకు తగ్గించారు. దీని ద్వారా భారత్‌కు చెందిన 23.6 లక్షల చదరపు కిలోమీటర్ల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఇఇజి)లో సుమారు 99 శాతం ప్రాంతం అన్వేషణకు అందుబాటులోకి వచ్చింది.

ఈ ఏరియాల్లో అన్వేషణ పెరుగుతుంది. అన్వేషణ పెరిగినంత మాత్రాన ఖచ్చితంగా గ్యాస్, పెట్రోలియం ఉంటుదని హామీ ఇవ్వదు. డీప్–సీ ఎక్స్‌ప్లోరేషన్ చాలా ఖరీదైనది, సాంకేతికంగా క్లిష్టమైనది, ఫలితాలు అనిశ్చితంగా ఉండే పక్రియ. అందుకే మెరుగైన భౌగోళిక డేటా, మరిన్ని డ్రిల్లింగ్ కార్యకలాపాలు, కొత్త మౌలిక వసతుల ద్వారా అన్వేషణ నుంచి ఉత్పత్తి దశకు చేరే అవకాశాలను 'సముద్ర మథన్' పెంచే ప్రయత్నం చేస్తోంది. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే భారత ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం తగ్గుతుంది. అదే సమయంలో బయో ఇంధనాలపైనా ప్రయత్నాలు సాగాలి. పరిశోధనలు చేపట్టాల్సి ఉంది. సోలార్ పవర్ పరిశోధనలు విస్తృతం కావాలి. దీనిలో విజయం సాధిస్తే ఇంధన కొరతను అధిగమించవచ్చు. ఈ దిశగా పరిశోధనలు పెరగాలి. సోలార్ పవర్‌ను చౌకగా ఉత్పత్తి చేసుకునే దశకు చేరుకోవాలి. అప్పుడే మనకు భవిష్యత్ సులువు కాగలదు. అతిగా విదేవాలపై ఆధారపడాల్సిన ఆగత్యం పోతుంది. దీంతో ఇంధన అవసరాలతో పాటు, విద్యుత్ సంక్షోభం కూడా తొలగనుంది.

# అప్పుడు అర్బన్ నక్సల్స్...ఇప్పుడేమో దిమాగీ నక్సల్స్

**ప్రధాని ఎర్రకోట్ ప్రసంగంలో ప్రస్తావనపై విమర్శలు.. మండిపడుతున్న వివిధ రాజకీయ పార్టీల నేతలు**

న్యూఢిల్లీ,ఆగస్ట్17(ఆర్‌ఎన్‌ఎ): ప్రధాని నరేంద్రమోడీ స్వాతంత్య దినోత్సవ వేడుకల్లో ఎర్రకోట పై నుంచి దిమాగీ నక్సల్స్ అనే వ్యాఖ్యలు చేయడం ప్రతిపక్షాల్లో ఆగ్రహానికి కారణమవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగంలో ఉపయోగించిన దిమాగీ నక్సల్ పదంపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. ప్రధాని మోడీ ఈ వ్యాఖ్యపై కాంగ్రెస్, సీపీఐ, సమాజ్‌వాదీ తదితర ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ.. మోదీ గతంలో తన రాజకీయ ప్రత్యర్థులను అర్బన్ నక్సల్స్ అని పిలిచారని, ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అంటున్నారని విమర్శించారు.

ఇది ప్రధాని నిరాశకు సంకేతమని అన్నారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు దిమాగీ నక్సల్స్ అంటే ఎవరో చెబుతూ సోషల్ మీడియా పోస్ట్ పెట్టారు. దీనికి కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం వ్యంగ్యంగా స్పందిస్తూ.. తాను 'దిమాగీ నక్సల్స్‌గా ఉండటానికి గర్విస్తున్నారని అన్నారు. రిజిజు ప్రకారం, దిమాగీ నక్సల్స్ అంటే.. మావోయిస్టులకు మద్దతు ఇస్తూ భారత రాజ్యాంగాన్ని తిరస్కరించే వారు, వేర్పాటువాదులకు మద్దతు ఇచ్చేవారు, ఆర్టికల్ 370కు మద్దతు ఇచ్చేవారు, దేశ ఈశాన్య ప్రాంతాన్ని భారతదేశం నుంచి వేరు చేయడానికి చికెన్ నెక్‌ను తెంచాలని కోరుకునేవారు అని అన్నారు. ఇప్పుడు దిమాగీ నక్సల్స్ అనే పదంపై సీపీఎం, కాక్రోచ్ జనతా పార్టీ సహా పలువురు కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఎర్రకోటపై నుంచి జాతిని ఉద్దేశిస్తూ ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ.. అడవుల్లో ఆయుధాలు పట్టుకుని పోరాడిన నక్సలైట్లను దాదాపుగా అంతం చేశామని చెప్పారు. అయితే మావోయిస్టు భావజాలంతో ఉన్న దిమాగీ నక్సల్స్‌ఇంకా అవకాశాల కోసం చూస్తున్నారని, హింస, అశాంతికి దారి తీసే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాలను అడ్డుకోవాలంటే అలాంటి వారిని గుర్తించి ఏకాకులు చేయాలని మోడీ అన్నారు. ఈ పదాన్ని ఉపయోగించడంపై సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ స్పందించారు. ఈ పదాన్ని ప్రభుత్వాన్ని విమర్శించే వారిని, జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టే వారిని ఉద్దేశించి చేశారని ఆయన అన్నారు. గతంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను విమర్శించే వారిని 'అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేశారని, ఇప్పుడు ఇదే తరహాలో 'దిమాగీ నక్సల్స్' అనే కొత్త పదాన్ని తీసుకువచ్చారని బేబీ అన్నారు.

మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా నక్సలిజాన్ని అంతం చేశామని చెబుతున్న విధానంపై బేబీ ప్రశ్నలు లేవనెత్తారు. యువకులు, యువతను పట్టుకుని న్యాయపక్రియ ముందు నిలబెట్టే బదులుగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదమని అభివర్ణించారు. వామపక్షాలు నక్సలిజాన్ని ఎప్పుడూ సమర్థించలేదని బేబీ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, దిమాగీ నక్సల్స్ ఇప్పుడు రాజకీయ రచ్చకు దారి తీసింది.



# బీహార్ అశోక్‌ధామ్ ఆలయంలో తొక్కిసలాట

**ఏడుగురు భక్తుల దుర్మరణం**

పాట్నా,ఆగస్ట్17(ఆర్‌ఎన్‌ఎ): బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. లఖిసరాయ్ జిల్లాలోని అశోక్‌ధామ్ ఆలయంలో సోమవారం తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. శ్రావణమాసం సోమవారం కావడంతో ఈ శివాలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. అయితే వారి మధ్యలో ఒక ఎలక్ట్రిక్ వైర్ తెగిపడిపోవడంతో ఒక్కసారిగా భయపడిపోయారు. షాక్ కొడుతుందనే ఆందోళనతో అక్కడినుంచి బయటకు పరిగెత్తే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో గాయపడినవారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ దిగ్భ్రాం÷–రతి వ్యక్తంచేశారు. క్షతగాత్రులకు సత్వర చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలు రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు.భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి వచ్చారు. దానికి తగ్గట్టే మేం ఏర్పాట్లు చేశాం. భయాందోళన కారణంగా వారు పరిగెత్తడంతో బారికేడ్లు పడిపోయాయి. దాంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ ఘటనకు ఎలక్ట్రిక్ వైర్ కారణంగా తెలుస్తోంది. ధ్రువీకరించుకున్న తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని లఖిసరాయ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు.

# అమెరికా గగనతలంలో తప్పిన ముప్పు

**ఢీకొనేంతగా దగ్గరకు వెళ్లిన రెండు విమానాలు**

**ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌తో ప్రయాణికులు సేఫ్**

న్యూయార్క్,ఆగస్ట్17(ఆర్‌ఎన్‌ఎ): ఆకాశంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలకు పెను ప్రమాదం తప్పింది. రెండింటికి ఒకటే నంబర్ ఉండటంతో అవి ఒకే మార్గంలోకి వచ్చి దాదాపు ఢీకొన్నంత పని అయ్యింది. అయితే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. అమెరికాలోని ఆరిజోనా రాష్ట్రం ఫీనిక్స్ ప్రాంతంలో అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలు గాల్లో ఎదురెదురుగా వచ్చాయి. ఫీనిక్స్ స్కైహార్బర్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అర్ధరాత్రి సమయంలో ఈ ఘటన జరిగింది. అందులో ఒక బోయింగ్ విమానం షికాగో నుంచి వస్తుండగా.. మరో విమానం అప్పుడే ఫీనిక్స్ నుంచి బయల్దేరింది. రెండింటికి ఒకట్నే ÷÷–లట్ నంబర్ ఉండటం (అమెరికన్ 2482), ప్రతికూల వాతావరణంవల్ల షికాగో విమానం ఆలస్యం కావడం రెండు విమానాలు ఒకే లైన్‌లోకి రావడానికి కారణమయ్యాయి. వేర్వేరు మార్గాల్లో వెళ్లే విమానాలకు ఎయిర్‌లైన్స్ ఇలా ఒకే నంబర్ ఇవ్వడం సాధారణమే. అయితే ఒకే కాల్ సైన్ ఉన్న విమానాలు ఒకే సమయంలో ఒకే ప్రదేశంలో ఉండటం మాత్రం అరుదుగా జరుగుతుంది. షెడ్యూలింగ్ పొరపాటు కారణంగా ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. అయితే ఈ అసాధారణ పరిస్థితిని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ గుర్తించారు. అరైవల్, డిపార్చర్‌లో ఉన్న విమానాలకు వెంటనే వేర్వేరు సూచనలు చేశారు. అరైవల్‌లో ఉన్న విమానాన్ని ఎక్కువ ఎత్తు తీసుకోమని, డిపార్చర్‌లో ఉన్న విమానాన్ని తక్కువ ఎత్తులో ప్రయాణించమని సూచించారు. ఆ సూచనకు తగ్గట్టుగానే పైలట్లు తమతమ మార్గాలను మార్చుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. తాను 25 ఏళ్లుగా ఈ విధులు నిర్వర్తిస్తున్నానని, ఇలాంటి పరిస్థితి ఎన్నడూ చూడలేదని కంట్రోలర్ చెప్పారు. అయితే ఈ భద్రతాలోపంపై దర్యాప్తు జరుగుతున్నది.

# బెంగాల్ తారాపీఠ్ హోటల్‌లో మంటలు

**మంటు క్షణాల్లో వ్యాపించడంతో ఏడుగురు మృతి.. నిద్రలో ఉండగా తెల్లవారు జామున**

కోల్‌కతా,ఆగస్ట్17(ఆర్‌ఎన్‌ఎ): పశ్చిమ బెంగాల్ లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారుజామున గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో ఈ మంటలు మొదలయ్యాయి. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉన్నారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఓ నాలుగు అంతస్తుల హోటల్ భవనంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఏడుగురు సజీవ దహనం కాగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈరోజు తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏసీ యూనిట్లలో సాంకేతిక లోపం కారణంగా మంటలు వ్యాపించాయి. భారీగా మంటలు చెలరేగడంతో గ్రౌండ్ ఎ÷–లోర్ మొత్తం క్షణాల్లోనే పొగ అలుము కుంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న సహాయక బృందాలు..



స్థానికులతో కలిసి రక్షణ చర్యలు చేపట్టారు. ఇంజిన్లతో మంటలను అదుపు చేసి మృ తుల ను, గాయపడిన వారిని రాంపూర్‌హాట్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, బాధితులంతా ప్రసిద్ధ కాళీ ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులుగా తెలుస్తోంది. అగ్నిప్రమాద ఘటనపై కోల్‌కతాకు చెందిన ఓ బాధిత మహిళ అతిథి స్పందించారు. హోటల్ మొత్తం పొగతో నిండిపోయిందని, దాని వల్ల చాలా మంది తప్పించుకోలేక పోయారని తెలిపారు. అలాగే, పలువురు శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది పడ్డారని వెల్లడించారు. బయటకు వచ్చేందుకు దారీ కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హోటల్‌లో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. అలారం కూడా పనిచేయలేదని పేర్కొన్నారు.





# ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం..

**సంతృప్తి స్థాయిలో జిల్లాను ముందంజలో నిలపాలి**

**జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు 176 అర్జీలు**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీకి నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించేందుకు అధికారులు కృషిచేయాలని.. ప్రజల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు, అర్జీదారులకు పరిష్కార వివరాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మొత్తం 176 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 52, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించి 32, పోలీసు శాఖకు 24, పంచాయతీరాజ్‌కు 17 అర్జీలు వచ్చాయి. అదేవిధంగా వైద్య ఆరోగ్యం, స్వర్ణగ్రామం-స్వర్ణ వార్డుకు ఆరు చొప్పున అర్జీలు రాగా విద్యుత్, ఉపాధికల్పన, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు నాలుగు చొప్పున అర్జీలు వచ్చాయి. డీఆర్‌డీఏ, ఇంటర్మీడియెట్ విద్యకు మూడు చొప్పున, వ్యవసాయం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, జాతీయ రహదారుల విభాగాలకు రెండేసి చొప్పున అర్జీలు వచ్చాయి. ఆర్కియాలజీ అండ్ మ్యూజియమ్స్, ప్రజా రవాణా, ఎక్సైజ్, అగ్నిమాపక, మత్స్య, ఐసీడీఎస్, ఇరిగేషన్, కార్మిక, మార్కెటింగ్, మైన్స్ అండ్ జియాలజీ శాఖలకు ఒక్కో అర్జీ వచ్చాయి. ఈ అర్జీలను క్షుణ్నంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాస్థాయి అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని.. అర్జీల పరిష్కారానికి సంబంధించి నాణ్యత, సంతృప్తి స్థాయిలో జిల్లాను ముందు వరుసలో నిలపాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



## నాగారం గ్రామ పరిధిలో మద్యం, డ్రగ్స్‌కు పూర్తి నిషేధం

**సెప్టెంబర్ 1 నుంచి అమలు... ఉల్లంఘిస్తే రూ.50 వేల జరిమానా**

మంథని ఆగస్టు 17: పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగారం గ్రామ పంచాయతీ పరిధిలో మద్యం దుకాణాలు, డ్రగ్స్ అక్రమ విక్రయాలపై గ్రామ సభ కఠిన నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన గ్రామ సభ సమావేశంలో తీసుకున్న తీర్మానం ప్రకారం సెప్టెంబర్ 1, 2026 నుంచి గ్రామ పరిధిలో ఎటువంటి మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడానికి అనుమతి లేదు. అలాగే అనుమతి లేకుండా డ్రగ్స్ రవాణా, అమ్మకం, వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు పంచాయతీ ప్రకటించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించి మద్యం దుకాణాలు నిర్వహించినా, డ్రగ్స్ విక్రయించినా రూ.50,000 జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మద్యం, డ్రగ్స్ అక్రమ విక్రయాల గురించి సమాచారం ఇచ్చిన వారికి జరిమానా మొత్తంలో నుంచి రూ.5,000 ప్రోత్సాహక నగదు ఇస్తామని పంచాయతీ తెలిపింది. గ్రామంలో శాంతిభద్రతలు, ప్రజారోగ్యం మరియు మంచి వాతావరణాన్ని కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని మంథని పోలీస్ స్టేషన్లో, ఎక్సైజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు నాగారం సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణ రెడ్డి పంచాయతీ కార్యదర్శి బి. రాజు, ఉప సర్పంచ్ ఎరుకల లలిత, వార్డు సభ్యులు బూడిద శ్రీకాంత్ దాసరి రవీందర్ జక్కుల భాగ్యలక్ష్మి బూడిద తిరుపతి తోకల శైలజ అనసూయ సత్యమ్మ ఎరుకల రాజశేఖర్ ఎరుకల జ్యోతి లు పేర్కొన్నారు. గ్రామస్తులందరూ ఈ నిబంధనలకు సహకరించాలని వారు కోరారు.



## శ్రీ దర్శన హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎంపీ డీకే అరుణ

మరికల్ : 17 ఆగష్టు: నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని శ్రీ దర్శన హాస్పిటల్ ను సోమవారం సాయంత్రం మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మరికల్ పట్టణంలో 24 గంటల సదుపాయం ఉన్న ఏకైక ఆసుపత్రి శ్రీ దర్శన హాస్పిటల్ అని కొనియాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డాక్టర్ రాకేష్ ను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ దర్శన హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రాకేష్, వైద్యులు రాహుల్, జగన్ మోహన్ గౌడ్, వంశీకృష్ణ బీజేపీ నాయకులు రతంగ్ పాండురెడ్డి, డోకూరు తిరుపతిరెడ్డి, నర్సన్ గౌడ్, ఎం.వేణుగోపాల్, బి.భాస్కర్ రెడ్డి, సుంకు ఉమేష్ కుమార్, గొల్ల రాజేష్, సురేందర్ గౌడ్, నరేష్ గౌడ్, పొలేమోని రమేష్, చెన్నయ్య, వెంకటేష్, ఆసుపత్రి సిబ్బంది అజయ్, కృష్ణ, శ్రీకాంత్, జానకి, ఆకాంక్ష, శ్రీదేవి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.






## జర్నలిస్ట్‌లకు ఆరోగ్య బీమా వర్తింపు చేయాలి

**జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె ఆజాద్.**

చింతలపూడి, ఆగస్టు 17:ఎపియూడబ్ల్యు జె 70 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకల సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమం,హక్కుల కాపాడాలని పోరాటం చేస్తున్న యూనియన్ ఏపీయూ డబ్ల్యూజే అని జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్ కే ఆజాద్ అన్నారు. సోమవారం ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 70 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర,జిల్లా నాయకత్వం పిలుపు మేరకు చింతలపూడి యూనిట్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా చింతలపూడి డిప్యూటీ తహసిల్దార్ షేక్ షకీలా కు జర్నలిస్ట్ ల సమస్యలు,డిమాండ్ ల పై వినతి పత్రం అందించారు. తరువాత పత్రికా రంగంలో సుదీర్ఘ కాలం పని చేసిన చింతలపూడి సీనియర్ పాత్రికేయులు మాదాసు పుల్లారావు ను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా వైస్ ప్రెసిడెంట్ అజాద్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్ట్స్ లకు ప్రమాద బీమా వెంటనే పునరుద్ధరించాలని,హెల్త్ స్కీమ్ అమలు అయ్యేలా చూడాలని,అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, జర్నలిస్ట్‌లపై జరుగుతున్న దాడులు గురించి వారి భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సీనియర్ సభ్యులు కె ఎస్ ఎస్ వీరయ్య,అమీర్ పాషా,సభ్యులు ఖలీల్,జి.నాగేశ్వరరావు,కె. యమ్. దేవకృపావరం, రజినీ, సంజయ్ ,బాలు, నరేష్, నాగేంద్ర, సత్యనారాయణ,ప్రసాద్, నదీమ్,సత్యనారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు .



## నాగపంచమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించిన భక్తులు

మంథని, 17 ఆగష్టు (డీప్ పల్స్) : నాగపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంథని పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో భక్తులు నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంథని పట్టణంలోని నాగుల సందిలో ఉన్న నాగమయ్య పుట్ట వద్ద,గాజులపల్లె గ్రామంలోని నాగదేవతల ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.వంశపారంపర్య సంప్రదాయాలను అనుసరిస్తూ పలువురు తమ ఇళ్లలో నాగదేవతను ప్రతిష్టించి పూజలు నిర్వహించారు.నాగపంచమి రోజున నాగపుట్టను పూజించడం,మట్టితో తయారు చేసిన నాగప్రతిమలకు పంచోపచార పూజలు చేయడం శ్రేష్టమని ధర్మశాస్త్రలు పేర్కొంటున్నాయని పండితులు తెలిపారు.పంచాంగ గణన ప్రకారం పంచమి తిథి,చిత్రా నక్షత్రం,శుభయోగం,బాలవ కరణం, కన్యారాశిలో చంద్రుని సంచారం వంటి అంశాల మధ్య నాగపంచమి పర్వదినం వచ్చిందని తెలిపారు.

నాగదోషం,రాహు-కేతువుల ప్రతికూల ప్రభావాలు ,గ్రహణ దోషాలు ఉన్నవారు ఈరోజు నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించడం శుభప్రదంగా భావిస్తారని పేర్కొన్నారు.నాగపూజతో కుటుంబంలో శాంతి, మానసిక ప్రశాంతత కలుగుతాయని, వివిధ సమస్యలు, భయాలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం.సూర్యుని రాశి మార్పు,ఆగస్త్య నక్షత్రోదయం వంటి ఖగోళ పరిణామాలు కూడా ఈ పర్వదినానికి ప్రత్యేకతను కలిగించాయని పండితులు వివరించారు.నాగపంచమి సందర్భంగా ఆలయాలు,నాగపుట్టల వద్ద ఉదయం నుంచే భక్తుల సందడి నెలకొంది.మహిళలు , చిన్నారులు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి నాగదేవతకు నైవేద్యాలు సమర్పించారు



## ఎంపీపీఎస్ కిష్టారెడ్డిపేటలో కంప్యూటర్ల ప్రారంభం

**విద్యార్థులకు డిజిటల్ విద్యపై అవగాహన**

పెబ్బేరు, 17 ఆగస్టు(డీప్ పల్స్) : మున్సిపల్ కేంద్రంలోని కిష్టారెడ్డిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏఎక్స్ఎల్ ప్రోగ్రాం క్రింద అందించిన కంప్యూటర్లను సోమవారం 6వ వార్డు కౌన్సిలర్ తాటికొండ కృష్ణ ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి జయరాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎక్స్ ఎల్ ప్రోగ్రాం క్రింద అందించిన ఈ కంప్యూటర్లను ఉపయోగించి వెనుకబడిన విద్యార్థులకు ప్రభావవంతమైన చదువును, డిజిటల్ బోధనను అందించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీపీసీ చైర్‌పర్సన్ బాలీశ్వరమ్మ, కాంప్లెక్స్ హెచ్ఎం నరసింహ గౌడ్, పాఠశాల హెచ్ఎం చెన్నకేశవులు,నారాయణ, కురుమయ్య,కృష్ణారెడ్డి ,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## పెబ్బేరులో ఘనంగా నాగుల పంచమి వేడుకలు

**పుట్టల వద్ద పాలు పోసి నాగదేవతను కొలిచిన భక్తులు**

పెబ్బేరు, 17 ఆగస్టు(డీప్ పల్స్) : పట్టణ కేంద్రంలో సోమవారం నాగుల చవితి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మిట్ట ఆంజనేయ,నాగులకుంట, వీరంపేట ఆంజనేయ, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే మహిళలు, భక్తులు నాగుపాము పుట్టల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి, పూజలు చేసి నాగదేవతను కొలిచారు. భక్తులు ఉపవాసాలు ఉండి నాగదేవతను దర్శించుకున్నారు. కొందరు మహిళలు చంటి పిల్లలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పుట్టల వద్ద పూజారులు ప్రత్యేక మంత్రాలు పఠించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# ఉత్తరాంధ్రలో నూతన చరిత్ర ఆవిష్కృతమైన రోజు

**అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం**

**భూములు ఇచ్చిన రైతన్నలకు కృతజ్ఞతలు**

**ఎర్ర బస్సు ప్లేసులో ఎయిర్ బస్ రాకపోకలు**

**వైజాగ్ ఎయిర్పోర్ట్ సిబ్బంది ఎమోషనల్ త్యాగం**

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు**

విజయనగరం, ఆగస్టు 17, ఉత్తరాంధ్రలో ఆగస్టు 17 వ తేదీ నూతన చరిత్ర ఆవిష్కృతమైన రోజుగా అభివర్ణించుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం భోగాపురం అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయం నుండి విమానాల రాకపోకలు ప్రారంభించడంతో ఉత్తరాంధ్ర ప్రజల కల సాకారమైందని మంత్రి కొండపల్లి పేర్కొన్నారు. లాంఛనంగా సోమవారం నుండి విమానాల రాకపోకలు సాగించటాన్ని చూడటం చాలా గర్వంగా ఉందన్నారు. గొడ్డలి పార్టీ అధినేత, వైకాపా నాయకులు ఎర్ర బస్సు కూడా రాదన్న ప్లేస్ కు ఎయిర్ బస్సు రావడం చూసి తట్టుకోలేకపోతున్నారన్నారు. ఈ సందర్భంలో విమానాశ్రయానికి భూములు ఇచ్చిన రైతన్నలందరికీ కూడా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని జిఎంఆర్ సంస్థ ఆధ్వర్యంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అతి తక్కువ సమయంలో పూర్తి చేయడం జరిగిందన్నారు. సోమవారం



కేంద్ర విమానయాన శాఖ మాత్యులు కింజరపు రామ్మోహన్ నాయుడు సారధ్యంలో విమానాశ్రయం నుండి రాకపోకలు సాగించిన ప్రయాణికులకు స్వాగతం పలకడం జరిగిందన్నారు. ఉత్తరాంధ్ర ఉత్తమాంధ్రగా మార్చే బృహత్తరమైన, సుందరమైన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే కాకుండా ప్రపంచంలో గుర్తింపు సాధిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలందరూ కూడా హర్షద్వానాల మధ్య విమానాశ్రయాన్ని స్వాగతించటం గర్వంగా ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

వైజాగ్ విమానాశ్రయ సిబ్బంది ఎమోషనల్ త్యాగంలి

వైజాగ్ విమానాశ్రయానికి వీడ్కోలు పలుకుతూ సిబ్బంది కన్నీటి పర్యంతమవటం వారి ఎమోషనల్ త్యాగాన్ని చాటి చెప్తుందన్నారు. గత ఎంతో కాలంగా ఉద్యోగ విధులు నిర్వహించి ఆ ప్రాంతంపై మక్కువ పెంచుకుని ప్రయాణికుల రాకపోకల సందర్భంలో చేదోడువాదోడుగా ఉన్న వారందరి త్యాగాన్ని వెలకట్టలేమని మంత్రి కొండపల్లి పేర్కొన్నారు. సాధారణంగా ఇరుగుపొరుగు వారితో కొన్ని రోజులు స్నేహం చేసి ఇతర ప్రాంతాలకు వెళుతుంటేనే తట్టుకోలేనంత బాధ ఉంటుందని, సుమారు 60 సంవత్సరాలుగా ఉద్యోగ విధులు చేసిన సంస్థను విడనాడటం మనసుకు చాలా బాధ కలిగిస్తుందన్నారు.

అందులో ఆంధ్ర ప్రాంత ప్రజలు అంటే ప్రేమకు, ఆప్యాయతకు, మమకారానికి నిలువెత్తు నిదర్శనంగా ఇతర రాష్ట్రాల ప్రజలు సైతం మన ప్రాంత ఔన్నత్యాన్ని కొనియాడటం మనం చూస్తూనే ఉంటామని, భావోద్వేగములతో ముడిపడి ఉన్న విమానాశ్రయ ఉద్యోగ బంధాన్ని జీర్ణించుకోవడం కష్టమేనన్నారు. మొన్నటి వరకు వైజాగ్ విమానాశ్రయం నుండి రాకపోకలు సాగించిన వాడినేనని, నాకు కూడా ఆ ప్రాంతాన్ని, అక్కడ సిబ్బంది ఆత్మీయత దూరమవటం మనసులో తీవ్రమైన బాధను, ఆవేదనను కలిగిస్తుందన్నారు. వైజాగ్ అనేది ఎప్పటికీ ఒక వండర్ఫుల్ సిటీ అని, రానున్న రోజులలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీచ్ కారిడార్ తో మరింత సుందరంగా మారుతుందనే ఆశాభావం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వ్యక్తం చేశారు.



## ఒలింపిక్స్ లో సత్తా చాటటమే ధ్యేయం

**కామవరపుకోట మండలానికి పేరు తేవాలి**

**యువ అథ్లెటిక్ పెద్దింటి రామ్ చరణ్**

కామవరపుకోట: ఆగస్టు 16, ఒలింపిక్స్ లో పాల్గొని సత్తా చాటటమే తన ధ్యేయమని కామవరపుకోట మండలం తూర్పుయడవెల్లి గ్రామానికి చెందిన పెద్దింటి రామ్ చరణ్ అనే యువ అథ్లెటిక్ పేర్కొన్నారు. ఒలింపిక్స్ లో స్థానం సంపాదించడంతో పాటు , రికార్డు స్థాపించాలనే పట్టుదలతో ముందుకు సాగుతున్నట్లు రామ్ చరణ్ పేర్కొన్నారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి 1:30 కు కామవరపుకోట చెక్పోస్ట్ వద్ద నుండి బయలుదేరి బొరంపాలెం అడ్డరోడ్డు, దేవులపల్లి , జంగారెడ్డిగూడెం, వేగవరం, తాడువాయి, జీలుగుమిల్లి నుండి అశ్వరావుపేట రింగు వరకు తన తొలి ప్రయత్నాన్ని ప్రారంభించారు. 60 కిలోమీటర్ల ఈ దూరాన్ని 4 గంటల 22 నిమిషాల్లో చేరుకున్నట్లు రామ్ చరణ్ తెలిపారు. ఆన్లైన్ ద్వారా తనకు ఊనగట్లకు చెందిన బొర్రా రాజేష్ పరిగెత్తే విధానాల్లో మెలకువలు చెబుతున్నట్లు రామ్ చరణ్ తెలిపారు. 2022లో 600 మీటర్స్ పరుగు పందెంలో రాష్ట్రం తరపున జరిగిన పోటీలలో ఉత్తరప్రదేశ్లో ప్రతిభ చాటి చెప్పినట్లు తెలిపారు. ఆ ఉత్సాహంతోనే ఆంధ్రప్రదేశ్ తరఫున రానున్న ఒలింపిక్స్ లో పాల్గొని దేశానికి పతకాన్ని తీసుకురావడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ఫిట్నెస్ పెంచుకోవడం కోసం క్రీడా ప్రాంగణంలో శిక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. తనకు సహకరిస్తున్న తన తల్లిదండ్రులు పెద్దింటి వెంకట దుర్గారావు, వెంకట్ లక్ష్మి కి, సహచర మిత్రులు నారాయణ, ధనుష్, రఘు శ్రీనివాసులకు రామ్ చరణ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ప్రభుత్వం తరఫున తనను గుర్తించి ప్రోత్సహించాలని, తన తల్లిదండ్రులకు, తాను పుట్టిన ఊరికి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చి పెట్టడమే తన ముందున్న లక్ష్యమని రామ్ చరణ్ పేర్కొన్నారు. పట్టుదలతో ముందుకు సాగుతున్న రామ్ చరణ్ లక్ష్యం నెరవేరడానికి మన వంతు మనం కూడా సహకరిద్దాం.



## పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన అర్జీలు పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులుపై చర్యలు తప్పవు

**ఫిర్యాదుదారులు వద్ద స్నేహపూరిత వాతావరణంలో ఫిర్యాదులు స్వీకరించారు**

**దివ్యాంగులు చెంతకు వెళ్ళి అర్జీలను స్వీకరించన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**

ఏలూరు, ఆగస్టు 17: జిల్లా కలెక్టరేటు గోదావరీసమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ,అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి లు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ధరఖాస్తులు పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించ వద్దని, కొంతమంది అధికారులు క్రింద స్థాయి సిబ్బంది దగ్గరకు పంపిస్తున్నారని, కొందరు నాపరిధి లోనిది కాదని సమాధానం చెబుతున్నారని ఇది క్షమించరాని నేరమని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో అర్జీదారుని వద్దకు వెళ్ళి వారితో ఫ్రెండ్లీగా మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నిర్ణీత సమయంలోగా పరిష్కారం చూపాలని అన్నారు. ధరఖాస్తులు పరిష్కారంలో అర్జీదారులు నుండి ఒక్కఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులుపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ రోజు వచ్చిన అర్జీలలో కొన్ని

కామవరపుకోట మండలం సాగిపాడు - వీరంపాలెంకు చెందిన అమృతల గోయమ్మ నేను దివ్యాంగురాలును పెన్షన్ రూ 6 వేలు వస్తున్నాయని, తల్లిదండ్రులు చనిపోయారని ఉండుటకు ఇల్లు కూడా లేదని నాకు ఉపాధి అవకాశం కల్పించాలని అర్జీని ఇచ్చారు, దెందులూరు మండలం కొత్తపల్లి - వేగవరం గ్రామానికి చెందిన వరికూటి మార్తమ్మ మాకు 50 సెంట్లు భూమి ఉందని, భర్త మరణించారని ఆ భూమిని నా పేరున ఆన్లైన్ చేయించాలని కోరారు, టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన రేగాళ్ల పుల్లయ్య మా అబ్బాయిలు, కోడళ్ళు కనీసం భోజనం కూడా పెట్టుటలేదని, నేను పంచి ఇచ్చిన ఆస్తిని నాపేరున బదలాయించాలని కోరారు, ఏలూరు మండలం మల్కాపురం గ్రామనివాసి జంపన వెంకటనారాయణ నాకు ఒక్క ఎకరం పొలం ఉంది పట్టాదారు పాసు పుస్తకం కూడా ఉంది, కాని ఆన్లైన్ లో 5 సెంట్లు భూమి మాత్రమే చూపిస్తుందని న్యాయం చెయ్యాలని అర్జీని సమర్పించారు, పోలవరం మండలం కొమ్ముగూడెం గ్రామనివాసి బాదావతు పార్వతి నేను ఐటిడిఏ ద్వారా వసతి వసతిగృహంలో 18 ఏళ్ళుగా పనిచేస్తున్నాను, రాత్రిపూట విధులు నిర్వహించాలని, నానా ఇబ్బందులు గురి చేస్తున్నారని, నాకు దివ్యాంగులు పిల్లలు ఉన్నారని న్యాయం చెయ్యాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, తహాశీల్దార్లు, డిప్యూటీ తహాశీల్దార్లు, మండల సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## గోడకూలి విద్యార్థి అరుణ్ తేజ మృతి చెందటంపై మంత్రి కొండపల్లి దిగ్భ్రాంతి



విజయనగరం, ఆగస్టు 17 : పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలీ పదో తరగతి విద్యార్థి మృతిచెందడం చాలా బాధాకరమని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. అరుణ్తేజ అనే పదో తరగతి విద్యార్థి మృతి చెందడం తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఈ విషయంపై విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ గారు వెంటనే స్పందించి మృతి చెందిన విద్యార్థికి ప్రభుత్వం తరపున రు. 5 లక్షల పరిహారం అందజేయడంతో పాటు గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. అలాగే స్థానిక మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణి గారు ప్రమాదంపై దర్యాప్తుకు ఆదేశించినట్టు మంత్రి కొండపల్లి తెలిపారు. విద్యార్థుల విషయంలో విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడంతో పాటు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు.



## స్కేటింగ్లో ప్రతిభ చాటిన విజయవాడ చిన్నారులు

విజయవాడ: ఆగస్టు 17,2026.

జోనల్ స్థాయి, రీజనల్ స్థాయి స్కేటింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించిన అండర్ -11 బాలుర విభాగానికి చెందిన నడికట్ల బ్లెస్సన్ ఆనంద్, అండర్--14 బాలికల విభాగానికి చెందిన నడికట్ల ఘనత ఆనంద్ ల తండ్రి వారి పిల్లలు సాధించిన విజయాల గురించి పీజిఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ కలిసి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ క్రీడల్లో ప్రతిభను ప్రదర్శిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకువస్తున్నందుకు చిన్నారులు ఇద్దరిని ప్రత్యేకంగా ప్రశంసించారు. సిఐఎస్సిఇ బోర్డు ఆధ్వర్యంలో ఈ సంవత్సరం జూన్ 6న రావులపాలెంలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీలలో అండర్--11 బాలుర విభాగం రోడ్ రేస్ పోటీల్లో నడికట్ల బ్లెస్సన్ ఆనంద్ ఒక బంగారు, రోడ్ రేస్ లో ఒక బంగారు పథకాన్ని సాధించారు. అలాగే అండర్--14 బాలికల విభాగంలో రోడ్ రేస్ పోటీల్లో నడికట్ల ఘనత ఆనంద్ ఒక బంగారు పతకాన్ని, రింక్ రేస్ పోటీల్లో ఒక బంగారు పథకాన్ని సాధించారు. ఆగస్టు 6న రావులపాలెంలో నిర్వహించిన రీజనల్ స్థాయి పోటీలలో అండర్--11 బాలుర విభాగం రోడ్ రేస్ పోటీల్లో నడికట్ల బ్లెస్సన్ ఆనంద్ ఒక రజిత పథకాన్ని సాధించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన ఘనత ఆనంద్, బ్లెస్సన్ ఆనంద్లను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అభినందించారు. చిన్న వయస్సులోనే క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తూ క్రమశిక్షణతో సాధన చేసి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, నిరంతర సాధన, క్రమశిక్షణతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తండ్రి నడికట్ల డేనియల్ ఆనంద్, కోచ్ ఎస్.కె పవన్ కుమార్ పాల్గొన్నారు.



## సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి- జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఘనంగా సర్దార్ గౌతు లచ్చన్న జయంతిలి

ఏలూరు, ఆగష్టు, 16 : సామాజిక విప్లవకారుడు, సంఘ సంస్కర్త సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్లో ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న స్వాతంత్ర సంగ్రామ సమయంలో తెల్లదొరలను దేశం నుండి తరిమివేయడంలో ఆయన చూపిన పోరాటం నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న ఒక సంఘ సంస్కర్త. అంటరానితనానికి వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాడారని, అట్టడుగు వర్గాలు, గ్రామీణ సమాజాల అభ్యున్నతికి, వారి హక్కుల కోసం కృషి చేశారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న రైతు--కార్మిక పక్షపాతి అని, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు.



# పారిశ్రామికాభివృద్ధిపై తెలంగాణ మోడల్ చర్చ

**న్యూఢిల్లీ, ఆగస్టు 17, :**

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహానికి అమలు చేస్తున్న విధానాలను దేశంలోని ఇతర రాష్ట్రాలకు పరిచయం చేసే దిశగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక సమావేశం నిర్వహించారు. న్యూఢిల్లీలో పరిశ్రమల శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా, ఉన్నతాధి కారులతో భేటీ అయిన ఆయన తెలంగాణలో అమలవుతున్న పారిశ్రామిక విధానాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో తెలంగాణ పారిశ్రామిక వాడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, భూ కేటాయింపుల ప్రక్రియ, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై శ్రీధర్ బాబు వివరించారు. పరిశ్రమలు వేగంగా స్థాపించేందుకు అవసంమైన అనుమతులను ఒకే వేదికపై అందించే టీజీ ఐపాస్ వ్యవస్థ గురించి ప్రత్యేకంగా వివరించినట్లు తెలిపారు. పెట్టుబడిదా రులకు సులభతరం చేసే ఈ విధానం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడుల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తోందని మంత్రి తెలిపారు. పారదర్శకత, వేగవంతమైన నిర్ణయాలు, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తూ టీజీ ఐపాస్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమల స్థాపనలో ఆలస్యం తగ్గించి పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ పారిశ్రామికాభివృద్ధి నమూనాను అధ్యయనం చేసేందుకు ఢిల్లీ ప్రతినిధి బృందం రాష్ట్రాన్ని సందర్శిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటులో ఎదురయ్యే సమస్య లను తగ్గించి, పెట్టుబడులను ఆకర్షించే విధానాలపై వారు ఆసక్తి కనబరుస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడి అనుమతుల విధానం, పారిశ్రామిక మౌలిక సదుపా యాల కల్పనపై వారికి వివరించినట్లు తెలిపారు. తెలం గాణలో పరిశ్రమలకు అనుకూలమైన ం, వేగవంతమైన అనుమ తుల వ్యవస్థ, ఆధునిక మౌలిక సదుపాయాల వల్ల దేశీయ, విదేశీ పెట్టుబడులు పెరుగుతున్నాయని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.



# జహీరాబాద్ స్మార్ట్ సిటీతో ఉద్యోగ విప్లవం

**హైదరాబాద్, ఆగస్టు 17, :**

జహీరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ తెలంగాణ పారిశ్రామిక రంగానికి కొత్త ఊపునివ్వనుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. 3,245 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ పారిశ్రామిక నగర అభివృద్ధి పనులను 2028 మార్చి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ నిర్వహించిన వీడియో సమావేశంలో శ్రీధర్ బాబు వర్చువల్‌గా పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పరిశ్రమల మంత్రులు సమావేశంలో పాల్గొన్నారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు రెండు లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో భూమి రూపంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతం ఉండగా, అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తోందని తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థకు అభివృద్ధి ప్రణాళిక అందజేశామని, ఇంజనీరింగ్, కొనుగోలు, నిర్మాణ విధానంలో చేపడుతున్న పనులు నిర్ణీత గడువులో పూర్తవుతాయని చెప్పారు.

నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, విద్యుత్ సరఫరా మౌలిక వసతుల ఏర్పాటును కూడా వేగంగా పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలకు అవసరమైన అన్ని ప్రాథమిక సదుపాయాలను సమకూర్చి పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు.



# పోలీస్ అధికారుల సంఘానికి నూతన నాయకత్వం

**వరంగల్, ఆగస్టు 17, :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేతను మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పోలీస్ కమిషనర్‌కు పరిచయం చేశారు. సంఘం అధ్యక్షుడిగా కె. కరుణాకర్, ఉపాధ్యక్షులుగా బి. సతీష్, బి. శరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఇ. వీరభద్రరావు, సంయుక్త కార్యదర్శిగా టి. నరేష్ బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు. అదేవిధంగా కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్. ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా బి. నరేష్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎం. తులసి, సి.హెచ్. మహేందర్ యాదవ్, ఏ. రమేష్, ఎన్. ప్రవీణ్, ఎం.డి. తాజుద్దీన్, పి. సర్వేశ్‌లు ఎన్నికైనట్లు తెలిపారు. నూతన బృందానికి అధికారులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా



మాట్లాడిన పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేత, నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి అండగా నిలుస్తూ వారి సంక్షేమానికి కృషి చేయాలని సీపీ ఆకాంక్షించారు. విధి నిర్వహణలో సిబ్బందికి స్ఫూర్తినిస్తూ ఆదర్శవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నాగయ్య, సదయ్య, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు, నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది.

# ప్రజా సమస్యలపై ఎస్పీ స్పందన

**కడప, ఆగస్టు 17, :**

వైఎస్సార్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ పాల్గొని ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు, ఇతర న్యాయ సంబంధిత అంశాలకు సంబంధించిన అర్జీలను అధికారులు నమోదు చేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పంపిం చాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజల సమ స్యల పరిష్కారంలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు న్యాయం అందేలా చట్టపరమైన చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులతో అధికారులు నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని పేర్కొ న్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పోలీసు వ్యవస్థ పనిచేయాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువ వుతోందని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్ర మంలో స్వీకరించిన అర్జీలపై సంబంధిత విభాగా లు సమగ్ర విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరిం చేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు.





# రూ.2 లక్షల రుణమాఫీతో రైతులకు ఊరట

**రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం**

**రూ.20,616 కోట్ల రుణాల మాఫీ**

**ఇంటింటి ధృవీకరణతో అర్హుల గుర్తింపు**

**పారదర్శక అమలుపై ప్రభుత్వ దృష్టి**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, ఆగస్టు 17, :**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తొలి పంట సీజన్‌లోనే రూ.2 లక్షల వరకు పంట రుణాలను ఒకేసారి మాఫీ చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించినట్లు తెలిపారు. రైతాంగాన్ని అప్పుల భారం నుంచి బయటపడేసి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 25,35,964 మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా రూ.20,616.89 కోట్ల పంట రుణాలను మాఫీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. దేశ చరిత్రలోనే ఇది ఒక కీలక ఘట్టమని పేర్కొంటూ, రైతుల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. గత ప్రభుత్వ పాలన నుంచి వచ్చిన ఆర్థిక ఒత్తిడులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుని ఈ నిర్ణయం అమలు చేసినట్లు వివరించారు. రుణ మాఫీ అమలులో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని మంత్రి తెలిపారు. 40 బ్యాంకుల నుంచి అర్హులైన రైతుల రుణ ఖాతాల వివరాలను సేకరించి సమగ్ర పరిశీలన చేపట్టినట్లు చెప్పారు. బ్యాంకులు సమర్పించిన 42.30 లక్షల రుణ ఖాతాల్లో 31.07 లక్షలను కుటుంబ ఖాతాలుగా గుర్తించి పరిశీలించామని వివరించారు. అనంత రం అర్హత ప్రమాణాల ప్రకారం రూ.2 లక్షల వరకు బకాయిలు ఉన్న 25,35,964 ఖాతాలను ఎంపిక చేసి రుణమాఫీ అమలు చేసినట్లు వెల్లడించారు. రుణమాఫీ ప్రక్రియలో కొన్ని సాంకేతిక, పత్రాల సంబంధిత సమస్యలు వెలుగులోకి వచ్చాయని మంత్రి తెలిపారు. ఏ ఒక్క అర్హ రైతు కూడా లబ్ధి నుంచి దూరం కాకూడదనే ఉద్దేశంతో అధికారులు గ్రామాల వారీగా ఇంటింటి సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఆధార్ అనుసంధానం, ఖాతాల సవరణ, ఇతర వివరాల పరిశీలనకు దాదాపు రెండు నెలల పాటు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. దీంతో తొలిదశలో మిగిలిపోయిన అర్హ రైతులను గుర్తించి తదుపరి విడతలో ప్రయోజనం అందించినట్లు తెలిపారు. రుణమాఫీ అమలుకు సంబంధించిన పూర్తి వివరాలను శాసనసభ ముందుంచామని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా, గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితాలను అందుబాటులో ఉంచి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించినట్లు చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి చర్యలో జవాబుదారీతనం, పారదర్శకత, అర్హత పరిశీలనకు ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రధాన అజెండా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, ఇచ్చిన హామీలను సమర్థంగా అమలు చేయడం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా రైతులకు అవసరమైన సహాయం అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

# ఓటర్ల జాబితా సవరణపై సమీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 17, :**

తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2026 కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చిం చారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చిత త్వం, సమగ్రతకు ప్రాధాన్యం ఇస్తూ అన్ని రాజకీయ పార్టీల సహకారంతో ఓటర్ల జాబితాను మరింత పటిష్టంగా రూపొందించేందుకు చర్యలు కొనసాగ ుతున్నాయని ఆయన వివరించారు. జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు నిర్వహించిన ఎన్యూమ రేషన్ దశ విజయవంతంగా పూర్తయిందని సీఈఓ తెలిపారు. ఈ కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 2.65 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించినట్లు వెల్లడించారు. ఇది మొత్తం ఓటర్లలో 78.30 శాతానికి సమానమని పేర్కొన్నారు. ఓటర్ల వివరా లను క్షుణ్ణంగా పరిశీలి స్తూ భవిష్యత్‌లో ఎలాంటి లోపాలు లేకుండా జాబితా రూపొందించేందుకు ఎన్నికల యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. సమావేశంలో మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వ్యక్తులు, అందుబాటులో లేని ఓటర్లు, అలాగే ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదైన ఓటర్లకు సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఓటర్ల జాబితాలో నకిలీ లేదా అనర్హ నమోదులు లేకుండా చర్యలు తీసు కుంటున్నామని, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యమని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదలకు సంబంధించిన ఏర్పాట్లను కూడా సమావేశంలో వివరించారు.



# శిరోరక్షే ప్రాణరక్ష

**బాపట్ల, ఆగస్టు 17, :**

ద్విచక్ర వాహనదారుల ప్రాణ భద్రత కోసం బాపట్ల జిల్లా పోలీసులు "శిరోరక్ష -- ప్రాణరక్ష" పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసులు వాహన తనిఖీలు చేపడుతూ హెల్మెట్ ధరించ డం ఎంత ముఖ్యమో ప్రజలకు వివరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక మరణాలకు తలకు తగిలే గాయా లే కారణమవు తున్నాయని పోలీసులు చెబుతున్నారు. సరైన నాణ్యత కలి గిన హెల్మెట్ ధరించ డం ద్వారా ప్రాణనష్టం ప్రమా దాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అవగాహన కల్పిస్తు న్నారు. హెల్మెట్ అనేది జరిమా నాల భయంతో కాదు, కుటుంబం కోసం, సొంత భద్రత కోసం ధరించాలని అధికా రులు సూచిస్తున్నారు. రాష్ట్రంలోనే కాకుం డా దేశవ్యాప్తంగా ద్విచక్ర వాహనా ల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు భద్రత మరింత కీలకంగా మారింది. కేవలం వాహనం నడిపే వ్యక్తి మాత్రమే కాకుండా వెనుక కూర్చునే వ్యక్తి కూడా హెల్మెట్ ధరించడం అవసరమని పోలీసు లు గుర్తు చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల కుటుం బాలు తీవ్ర విషాదంలో మునిగిపోతున్నాయని పేర్కొంటు న్నారు. బాపట్ల జిల్లాలో ఇప్పటికే "హెల్మెట్ లేకుంటే ఇంధనం లేదు" అనే కార్యక్రమాన్ని కూడా పోలీసు లు అమలు చేస్తున్నారు.





# మండల ప్రజావాణికి విశేష స్పందన

హైదరాబాద్, ఆగస్టు 17

:ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే స్వీకరించి వేగవంతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు పరిష్కారం కోసం వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఈ కార్యక్రమం కీలకంగా మారిందని అధికారులు పేర్కొన్నారు.రాష్ట్రంలోని 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించగా, సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కూడా ప్రత్యేకంగా ప్రజావాణి చేపట్టారు. దీంతో మొత్తం 566 కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ పర్యవేక్షణలో కార్యక్రమం సమర్థంగా కొనసాగింది. ప్రతి మండలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,410 వినతులు స్వీకరించబడటం ప్రజల్లో ఈ కార్యక్రమంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్, రెవెన్యూ, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన వినతులు పెద్ద సంఖ్యలో అందాయి. వచ్చిన ప్రతి వినతిని అధికారులు నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపే ప్రక్రియను ప్రారంభించారు. సమస్యల స్వభావాన్ని బట్టి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా 10,753 మంది అధికారులు హాజరయ్యారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రత్యేక డెస్కుల వద్ద ప్రజల నుంచి వినతులను స్వీకరించి వివరాలు నమోదు చేశారు. ప్రజలకు మార్గనిర్దేశం చేసేందుకు హెల్ప్ డెస్కులు, మంచినీటి సదుపాయాలు, కూర్చునే ఏర్పాట్లు కల్పించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునే అవకాశాన్ని అధికారులు సద్వినియోగం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే కరీంనగర్ జిల్లా అత్యధికంగా 704 వినతులతో మొదటి స్థానంలో నిలిచింది. ఒక్కో మండలానికి సగటున 47 వినతులు అందిన జిల్లాగా కూడా కరీంనగర్ ముందంజలో ఉంది. రాష్ట్ర స్థాయిలో ఒక జిల్లాకు సగటున 164 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం వల్ల స్థానిక సమస్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఏర్పడిందని పేర్కొన్నారు.

# ఆక్రమణలపై హైడ్రాకు 52 ఫిర్యాదులు



హైదరాబాద్, ఆగస్టు 17

నగర పరిధిలో పార్కులు, రహదారులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణిలో మొత్తం 52 ఫిర్యాదులు అందాయి. కాలనీల్లో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, పార్కులు, అంతర్గత రహదారులు ఆక్రమణలకు గురవుతున్నాయని పలువురు ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. అందిన వినతులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి సంబంధిత అధికారులకు పంపించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేటలోని గ్రీన్‌ఫీల్డ్ కాలనీకి సంబంధించిన ఫిర్యాదు ప్రధానంగా నిలిచింది. 1991లో ఏర్పాటైన లేఔట్‌లో రహదారులు, పార్కులు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు ప్రస్తుతం ఆక్రమణలకు గురవుతున్నాయని కాలనీ వాసులు పేర్కొన్నారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ పొందిన ప్లాట్ల పరిధిలోనే కొత్తగా ఆక్రమణలు జరుగుతున్నాయని, అసలు లేఔట్ రూపురేఖలు మారిపోతున్నాయని ఫిర్యాదులో వివరించారు. కాలనీకి ప్రాణాధారమైన రహదారులు, పార్కులను కాపాడాలని వారు కోరారు. మదీనాగూడ ఆర్టీసీ కాలనీలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన 402 చదరపు గజాల స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించారనే ఆరోపణలు ప్రజావాణిలో వినిపించాయి. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఈ అంశాన్ని హైడ్రా దృష్టికి తీసుకువెళ్లారు. వైద్య సదుపాయాలు, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని యథాతథంగా పరిరక్షించాలని, అక్రమ లావాదేవీలపై విచారణ జరిపించాలని కోరారు. మేకలమండి బస్తీ, పటేల్‌గూడ, గాజులరామారం, వనస్థలిపురం ప్రాంతాల నుంచి కూడా పలు ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు, రహదారుల ఆక్రమణలు, చెరువు పరిధుల్లో నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో గతంలో తొలగించిన అక్రమ నిర్మాణాలను మళ్లీ ప్రారంభించారని, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గాజులరామారం చింతల్ చెరువు ప్రాంతంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక సంక్షేమ సంఘాలు ఫిర్యాదు చేశాయి. అలాగే వనస్థలిపురం మారుతీనగర్‌లో పార్కు, ఆలయం కోసం కేటాయించిన స్థలంలో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములను తిరిగి ప్రజలకే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిలో అందిన అన్ని ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టాలని హైడ్రా కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములు, పార్కులు, రహదారులు, ప్రజా అవసరాల స్థలాల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆక్రమణలు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలతో పాటు అక్రమ నిర్మాణాల తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



# నిషేధిత భూముల సమస్యలకు పరిష్కారం

హైదరాబాద్, ఆగస్టు 17

రాష్ట్రంలో 22-ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సమస్యలపై వేగంగా స్పందించి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. భూములకు సంబంధించిన వివాదాలు, రిజిస్ట్రేషన్ సమస్యలు, పెండింగ్ దరఖాస్తులపై ఈ కమిటీ వారానికోసారి సమావేశమై నిర్ణయాలు తీసుకోనుందని తెలిపారు. సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో నిర్వహించిన సమీక్ష అనంతరం మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. ప్రధానంగా ఈ నాలుగు జిల్లాల్లోనే 22-ఏ భూముల సమస్యలు అధికంగా ఉన్నాయని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనే 511 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పెండింగ్ దరఖాస్తులను ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నిషేధిత భూముల సమస్యలపై ప్రజలకు సమాచారం అందించేందుకు 1800 5994788 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నంబర్‌కు అందిన ఫిర్యాదులు, సందేహాలకు కనీసం మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ సాధ్యం కాని కేసుల్లో ఎందుకు చేయలేమో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని, ఇప్పటికే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించిన వారికి నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. భూదాన్ భూములు, యూఎల్‌సీ భూములు, దేవాదాయ, అటవీ భూములకు సంబంధించిన పెండింగ్ సమస్యలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అసలైన హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, భూముల రికార్డుల్లో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని పేర్కొన్నారు. జియో ట్యాగింగ్ ద్వారా అసలు భూములను గుర్తించి అవసరమైన చోట రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేస్తామని వెల్లడించారు. గతంలో నిషేధిత జాబితా నుంచి తొలగించాల్సిన కొన్ని భూములు సాంకేతిక కారణాలతో ఇప్పటికీ అదే జాబితాలో కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. దీంతో సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అయితే ఈ సమస్యలను ప్రజలపై వదిలేయకుండా ప్రభుత్వం స్వయంగా పరిష్కార బాధ్యత తీసుకుంటోందని స్పష్టం చేశారు. అధికారుల తప్పిదాల కారణంగా ఎవరూ నష్టపోకుండా తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు ప్రైవేటు ఆస్తుల హక్కులను కూడా కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిషేధిత భూముల పేరుతో అసలైన యజమానులకు ఎలాంటి అన్యాయం జరగనివ్వబోమని స్పష్టం చేశారు.





# ప్రయాణికుల భద్రతకు ప్రత్యేక తనిఖీలు

బాపట్ల, ఆగస్టు 17, :

ప్రయాణికుల భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని బాపట్ల జిల్లా పోలీసులు ప్రత్యేక తనిఖీలను నిర్వహించారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ వాహనాలు, ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. ప్రయాణికుల భద్రతా ప్రమాణాలు, రవాణా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల సందర్భంగా వాహనాల పత్రాలు, ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు, అనుమతులు, భద్రతా పరికరాల లభ్యత వంటి అంశాలను పరిశీలించారు. ప్రయాణికులను అధిక సంఖ్యలో ఎక్కించడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, రవాణా నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. ట్రావెల్స్ బస్సుల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే భద్రతా పరికరాలు, అగ్నిమాపక యంత్రాలు, అత్యవసర నిష్క్రమణ ద్వారాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాలను కూడా అధికారులు తనిఖీ చేశారు. ప్రయాణికుల భద్రతకు భంగం కలిగించే అంశాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. వేగ పరిమితులను గౌరవించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, వాహనాల నిర్వహణపై శ్రద్ధ వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజల ప్రాణ భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పోలీసులు పేర్కొన్నారు. ప్రయాణికులకు సురక్షిత ప్రయాణ వాతావరణం కల్పించేందుకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రయాణికులు కూడా తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు పాటించని వాహనాలపై పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, పోలీసులతో ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# గురు రవిదాస్ జయంతి వేడుకలకు ఆహ్వానం

హైదరాబాద్, ఆగస్టు 17, :

సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురు రవిదాస్ మహారాజ్ బోధనలు సమాజానికి అందించిన మార్గదర్శకత్వాన్ని గుర్తు చేస్తూ ఆయన సందేశాలు నేటికీ ప్రాసంగికంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ జయంతి ఉత్సవాలను ఆగస్టు 22న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. గురు రవిదాస్ మహారాజ్ సమానత్వం, సామరస్యత, సామాజిక న్యాయం, పరస్పర గౌరవం వంటి విలువలను సమాజానికి అందించారని రాంచంద ర్ రావు పేర్కొన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా మానవతా భావనను పెంపొందించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన బోధనలు సమాజం లో ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు అణగారిన వర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని కల్పించాయని తెలిపారు. సమాజంలో సమాన అవకాశాలు, పరస్పర గౌరవం పెంపొందేందుకు గురు రవిదాస్ సందేశాలు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు. జయంతి ఉత్సవాల సందర్భంగా గురు రవిదాస్ జీవిత విశేషాలు, బోధనలను స్మరించుకునే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సభలు, సామాజిక చైతన్య కార్యక్రమాలు కూడా ఈ వేడుకల్లో భాగంగా ఉండనున్నాయి. ఈ



# రైతు వ్యతిరేక విధానాలపై వైసీపీ విమర్శలు

అమరావతి, ఆగస్టు 17, :

ఆంధ్రప్రదేశ్‌లో రైతాంగ ప్రయోజనాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. రైతులకు నష్టం జరుగుతుందని తెలిసినా కీలక సాగునీటి ప్రాజెక్టులను నిలిపివేశారని, రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమైందని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డి ఆరోపించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను నిలిపివేయడం వల్ల ఆ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. సాగునీటి వనరుల అభివృ ద్ధికి ఉపయోగపడే ప్రాజెక్టులపై ప్రభు త్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి ఈ ప్రాజెక్టులు కీలకమని వైఎస్సార్‌సీపీ నేతలు గతంలో కూడా పేర్కొన్నారు. పులిచింతల ప్రాజెక్టు దిగువ న తెలంగాణ కాలువ తవ్వకాలు జరుగు తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించ డం లేదని కారుమూరు వెంకటరెడ్డి విమర్శించారు. నీటి వనరుల అంశంలో ఆంధ్రప్రదేశ్ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సంబంధాల పేరుతో రాష్ట్ర ప్రయోజ నాలను తాకట్టు పెడుతున్నారనే అనుమానా లు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఆయన ఆరోపించారు. రైతుల ప్రయోజ నాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని కోరారు. వ్యవసాయం, సాగునీటి రంగాల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం మరింత చురుకుగా వ్యవహరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టుల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరింది. రైతాంగ సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల హక్కుల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలు పేర్కొన్నారు.





# రాజమౌళితో పాటు మరో దర్శకుడి ఎంట్రీ!

హైదరాబాద్, ఆగస్టు 17

**దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో రూపొందుతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి అప్‌డేట్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ సినిమా మేకింగ్‌కు సంబంధించి ఓ ఆసక్తికరమైన విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.**

రాజమౌళితో పాటు మరో దర్శకుడు కూడా 'వారణాసి' ప్రాజెక్ట్‌లో భాగమైనట్లు తెలుస్తోంది. అయితే ఆయన ప్రధాన చిత్రానికి దర్శకత్వం వహించడం లేదు. 'వారణాసి' ఎలా రూపుదిద్దు కుంటోంది? రాజమౌళి టీమ్ ఎలాంటి కష్టపడుతోంది? నటీనటులు ఎలాంటి వర్క్‌షాప్స్‌కు హాజరవు తున్నారు? భారీ సెట్స్ నిర్మాణం, యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ ఎలా జరుగుతోంది? వంటి అంశాలను చూపించే ప్రత్యేక మేకింగ్ డాక్యుమెంటరీ బాధ్యతలను ఆయన తీసుకున్నట్లు సమాచారం. ఈ మేకింగ్ డాక్యుమెంటరీ కోసం జార్జియాకు చెందిన దర్శకుడు గోగితా చిక్వాడ్జేను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. డాక్యుమెంటరీ చిత్రీకరణలో అనుభవం ఉన్న ఆయన.. 'వారణాసి' ప్రీ-ప్రొడక్షన్ దశ నుంచే తన కెమెరాలతో ఈ సినిమా ప్రయాణాన్ని రికార్డ్ చేస్తున్నట్లు సమాచారం. నటీనటుల వర్క్‌షాప్స్, పాత్రల కోసం వారు చేస్తున్న ప్రత్యేక శిక్షణ, భారీ సెట్స్ నిర్మాణం, షూటింగ్ ప్రక్రియ, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ వంటి కీలక అంశాలను ఈ డాక్యు మెంటరీలో చూపించనున్నట్లు టాక్. సాధారణంగా సినిమా విడుదలకు ముందు లేదా షూటింగ్ చివరి దశలో మేకింగ్ వీడియోలను రూపొందిస్తుంటారు. కానీ 'వారణాసి' విషయంలో సినిమా రూపకల్పన ప్రారంభమైనప్పటి నుంచే మేకింగ్‌ను డాక్యుమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజమౌళి ఆలోచనా విధానం, ప్రీ-ప్రొడక్షన్‌లో ఆయన ప్లానింగ్, నటీనటుల ప్రిపరేషన్, భారీ విజువల్స్‌ను రూపొందించే విధానం వంటి అంశాలను ప్రేక్షకులు మరింత దగ్గరగా చూసే అవకాశం ఉంటుంది.

## 'డీసీ'కి మహేశ్ బాబు ప్రశంసలు

### సినిమా చాలా ఒరిజినల్ అంటూ కితాబు

హైదరాబాద్, ఆగస్టు 17

సినీ పరిశ్రమలో ప్రస్తుతం 'డీసీ' సినిమా హాట్ టాపిక్‌గా మారింది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ డ్రామాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తుండగా.. సినీ ప్రముఖుల ప్రశంసలు కూడా వరుసగా లభిస్తున్నాయి. తాజాగా టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు ఈ సినిమాను వీక్షించి తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. దీంతో 'డీసీ' మరోసారి వార్తల్లో నిలిచింది. సినిమా చూసిన అనంతరం మహేశ్ బాబు 'డీసీ'ని ప్రత్యేకంగా అభినందించారు. సినిమా చాలా ఒరిజినల్‌గా, అద్భుతంగా ఉందంటూ ప్రశంసలు కురిపించారు. సినిమా ప్రతి క్షణాన్ని ఆస్వాదించానని పేర్కొంటూ చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. సూపర్‌స్టార్ నుంచి వచ్చిన ఈ ప్రశంసలు 'డీసీ' టీమ్‌కు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. మహేశ్ బాబు పోస్టుకు సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ కూడా స్పందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు సినిమాకు వస్తున్న పాజిటివ్ టాక్ బాక్సాఫీస్ వసూళ్లపై కూడా ప్రభావం చూపుతున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. సుమారు రూ.25 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం తొమ్మిది రోజుల్లోనే దేశవ్యాప్తంగా రూ.50.26 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. రెండో వారాంతం నాటికి సినిమా బ్రేక్‌ఈవెన్ దాటి లాభాల బాట పట్టినట్లు తెలుస్తోంది.




## 'కొరియన్ కనకరాజు'కు బాక్సాఫీస్ వద్ద బిగ్ బూస్ట్..

### రూ.50 కోట్ల గ్రాస్ మార్క్ దాటిన వరుణ్ తేజ్ సినిమా

హైదరాబాద్, ఆగస్టు 17

హీరో వరుణ్ తేజ్‌కు బాక్సాఫీస్ వద్ద ఎట్టకేలకు మంచి విజయం దక్కింది. ఆయన తాజాగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతంగా దూసుకెళ్తోంది. విడుదలైన తొలి వారాంతంలోనే మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. ఆ తర్వాత వర్కింగ్ డేస్‌లోనూ అదే జోరును కొనసాగించింది. రెండో వారాంతంలో 'కొరియన్ కనకరాజు'కు 'విశ్వ నాథ్ అండ్ సన్స్' నుంచి పోటీ ఎదురైంది. అయినప్పటికీ ఈ సినిమా వసూళ్లపై పెద్దగా ప్రభావం పడకుండా మంచి నంబర్లను నమోదు చేస్తోంది. తాజాగా ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటినట్లు చిత్రబృందం ప్రకటించింది. మిడ్‌రేంజ్ హీరో సినిమాగా ఈ స్థాయి వసూళ్లు సాధించడం విశేషంగా మారింది. గత కొంతకాలంగా వరుణ్ తేజ్ సరైన కమర్షియల్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో 'కొరియన్ కనకరాజు' విజయం ఆయనకు మంచి బూస్ట్ ఇచ్చిందని చెప్పొచ్చు. మెర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం హారర్, కామెడీ అంశాలను మేళవించి రూపొందించారు.






## అనసూయ వ్యాఖ్యలపై బీజేపీ నేతల ఫిర్యాదు..

### బోరబండ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాలని డిమాండ్

హైదరాబాద్, ఆగస్టు 17

నటి అనసూయ చేసిన మతపరమైన వ్యాఖ్యలు ప్రస్తుతం వివాదానికి దారితీశాయి. ఆమె చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయంటూ బీజేపీ నాయకులు హైదరాబాద్‌లోని బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనసూయపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఇటీవల సోషల్ మీడియాలో అనసూయ చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. 'జై శ్రీరామ్' పేరుతో కొందరు దాడులకు పాల్పడుతున్నారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మతపరమైన అంశాలపై మాట్లాడేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఇలాంటి వ్యాఖ్యల ద్వారా ఇతరుల మనోభావాలను దెబ్బతీయకూడదని వారు సూచించారు. అయితే ఈ వివాదంపై అనసూయ వెనక్కి తగ్గినట్లు కనిపించడం లేదు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని ఆమె స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. తనను విమర్శిస్తున్న వారికి కూడా ఆమె ఘాటుగా స్పందించినట్లు సమాచారం. తన వ్యాఖ్యల కారణంగా "దొంగలంతా బయటకు వస్తున్నారు" అంటూ ఆమె కౌంటర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో మొదలైన ఈ వివాదం ఇప్పుడు పోలీస్ స్టేషన్ వరకు చేరడంతో విషయం మరింత ఆసక్తికరంగా మారింది. బీజేపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? విచారణ చేపడతారా? అనసూయను వివరణ కోరుతారా? అనే అంశాలపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. మరోవైపు ఈ వివాదం మరింత ముదిరే అవకాశాలపైనా ఆసక్తి నెలకొంది. ఇప్పటికే సోషల్ మీడియాలో అనసూయకు అనుకూలంగా, వ్యతిరేకంగా నెటిజన్లు స్పందిస్తుండటంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

## జియో హాట్‌స్టార్ నుంచి 'ప్రేమలు' హిందీ వెర్షన్ ఔట్.. కారణం ఇదే!

హైదరాబాద్, ఆగస్టు 17

సూపర్‌హిట్‌గా నిలిచి తెలుగులోనూ విడుదలై మంచి వసూళ్లు సాధించిన మలయాళ చిత్రం 'ప్రేమలు' గురించి ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. కేరళ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ సినిమా తెలుగుతో పాటు హిందీలోనూ డబ్ అయి మంచి స్పందన అందుకుంది. ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్నప్పటికీ.. అనూహ్యంగా హిందీ వెర్షన్ మాత్రం అందుబాటులో లేకుండా పోయింది. జియో హాట్‌స్టార్ నుంచి 'ప్రేమలు' హిందీ వెర్షన్‌ను తొలగించారు. అయితే దీనికి అసలు కారణం ఏమిటనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వివిధ భాషల్లో సూపర్‌హిట్ అయిన సినిమాలను హిందీలో రీమేక్ చేయడం సాధారణమే. అదే తరహాలో 'ప్రేమలు' చిత్రాన్ని కూడా హిందీలో రీమేక్ చేస్తున్నారు.



## 'విశ్వనాథ్ అండ్ సన్స్'కు నైజాంలో దుమ్మురేపే వసూళ్లు.. మూడు రోజుల్లోనే రూ.14 కోట్ల గ్రాస్

హైదరాబాద్, ఆగస్టు 17

హీరో సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది.

వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. విడుదలైన మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు సాధించడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమ స్పందన లభించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.








## అల్లు అరవింద్ వ్యాఖ్యలపై స్పందించిన 'కేజీఎఫ్' స్టార్

హైదరాబాద్, ఆగస్టు 17

'కేజీఎఫ్' సినిమాతో దేశవ్యాప్తంగా స్టార్‌డమ్ అందుకున్న కన్నడ హీరో యశ్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గతంలో టాలీవుడ్ ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తనను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై యశ్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. 'కేజీఎఫ్' తన కెరీర్‌ను మలుపు తిప్పిన విషయాన్ని అంగీకరిస్తూనే.. సినిమా విజయం, దానికి వచ్చే గుర్తింపుపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారు. సినిమా విజయం ఒక్కరి సొంతం కాదు: యశ్ ఒక సినిమా హిట్ అయితే నిర్మాత కంటే హీరోకే ఎక్కువ గుర్తింపు వస్తుందనే అంశంపై యశ్ స్పష్టంగా స్పందించారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467